# మంచి వార్త



## విశాల్ హృదయం!

ప్రభుత్వ దవాఖానలో చేరేది చాలావరకు పేదవాళ్లే. రోగి బాగోగులు చూసుకోడానికి, పరామర్శించడానికి వచ్చే ఆత్మీయుల సంఖ్య కూడా ఎక్కువే. అలా వచ్చిన వారు బుక్కెడు బువ్వకు కూడా ఇబ్బంది పడుతుంటారు. వారి ఆకలి తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాడు విశాల్ సింగ్. తను ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో మూడు పెద్ద ప్రభుత్వ దవాఖానల్లో రోగులు, వారి ఆత్మీయులకు రోజూ కడుపునిండా అన్నం పెడుతున్నాడు. ఈ నిర్ణయం వెనక ఓ మానవీయ కథనం ఉంది. చాలా రోజుల క్రితం విశాల్ తండ్రి ఏదో జబ్బుతో గురుగ్రామ్ దవాఖానలో చేరాడు. దీంతో తనే దగ్గరుండి అన్ని పనులూ చూసుకునేవాడు. ఆ సమయంలో అంతంత డబ్బు పెట్టి బయట భోజనం చేయలేక విశాల్ కడుపు మాడ్చుకునేవాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమకే దవాఖాన బిల్లులు, మందులు, తిండి ఖర్చులకు ఇంత ఇబ్బందిగా ఉంటే మామూలు వాళ్ల పరిస్థితి ఏంటనే ఆలోచన అతని మెదడును తొలిచేసేది. దవాఖానలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండొద్దని సంకల్పించుకున్నాడు. అతని సేవలు 2005లో లక్నోలోని కింగ్ జార్జ్ వైద్య విశ్వవిద్యాలయంలో మొదలయ్యాయి. అధికారులకు కూడా విశాల్ ఆలోచన నచ్చింది. వంటగది ఏర్పాటు చేసుకునేందుకు కొంత స్థలం ఇచ్చారు. అప్పటి నుంచి 'ప్రసాద సేవ' పేరుతో రోజుకు వందలాది మందికి అన్న భాగ్యం కల్పిస్తున్నాడు. దీనికి చాలా డబ్బే ఖర్చు అవుతుంది. తనకంటూ ఓ ఆదాయ వనరు కోసం ఓ టీకొట్టు తెరిచాడు. అనంతరం ఎలక్ట్రోడ్ కర్మాగారం ప్రారంభించాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి ప్రవేశించాడు. విశాల్ ఎవరి దగ్గరా నగదు రూపంలో డబ్బు తీసుకోడు. ధాన్యం, కూరగాయలు, ఇతర సరుకులు మాత్రం అంగీకరిస్తాడు. అన్నం, రొట్టె, పప్పు, రెండు కూరలు, సలాడ్, పాపడ్‌తో కడుపు నిండా భోజనం పెడతాడు. నాణ్యత విషయంలో రాజీ పడడు. విశాల్ రోజుకు 1200 మందికి ఒక్కపైసా తీసుకోకుండా అన్నం పెడుతున్నాడు. కొవిడ్ సమయంలో ఈ సంఖ్య 2500 దాకా ఉండేది. ఈ బృహత్తర కార్యక్రమం కోసం ఒక్కోసారి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. 'మనం ఎవరి ముఖంలోనైనా ఆనందం చూడాలనుకుంటే.. ఎంతటి బాధనైనా భరించాలి' అని నవ్వుతూ చెబుతాడు విశాల్.

## వైతాళికుల వాణి

ప్రజాస్వామ్య వ్యవస్థలో
ఒక్క ఓటరు అజ్ఞానం
అందరి భద్రతనూ
ప్రమాదంలోకి నెట్టేస్తుంది.

**• జాన్ ఎఫ్ కెన్నెడీ**

**(అమెరికా మాజీ అధ్యక్షుడు)**

## క్యా బాత్‌హై!

